క్లుప్తంగా

గురుకుల పాఠశాల సందర్శన

మధిర: మడుపల్లి హైస్కూల్ విద్యార్థులు పీఎం శ్రీ స్కీంలో ట్విన్నింగ్ ఆఫ్ ది స్కూల్స్‌లో భాగంగా బుధవారం కృష్ణాపురం సమీపంలోని మహాత్మ జ్యోతిబాపూలే గురుకుల పాఠశాలను సందర్శించారు. పాఠశాలలో జరుగుతున్న వివిధ కార్యక్రమాలను విద్యార్థులు ఆసక్తిగా పరిశీలించారు. తరగతిగది పరిశీలన, డైనింగ్ హాల్, కిచెన్, ఆటస్థలం తదితర వసతులను క్షుణ్ణంగా పరిశీలించారు. పాఠశాల ప్రిన్సిపాల్ రేగండ్ల శ్రావణి పాల్గొని విద్యార్థులకు వివిధ అంశాల గురించి వివరించారు. కార్యక్రమంలో మడుపల్లి పాఠశాల హెచ్ఎం తోట నరసింహారావు, ఎంఈఓ ప్రభాకర్ పాల్గొన్నారు.

నూరుశాతం ఫలితాలు సాధించాలి



విద్యార్థులకు భోజనం వడ్డిస్తున్న అధికారులు

బోనకల్: విద్యార్థులు పరీక్షల్లో నూరుశాతం ఫలితాలు సాధించాలని తహసీల్దార్ పెన్నం చందర్, ఎంఈఓ దామాల పుల్లయ్య తెలిపారు. బుధవారం మండల కేంద్రంలోని సాంఘీక సంక్షేమ పాఠశాలలో భోజనాలను పరిశీలించి, విద్యార్థులకు మటన్ కర్రీతో భోజనాలు వడ్డించారు. ఇంటర్ విద్యార్థులను.. పరీక్షలు ఎలా రాస్తున్నారో అడిగి తెలుసుకున్నారు.

వైభవంగా శ్రీవారి కల్యాణం

వేంసూరు: మండలంలోని కందుకూరులో కొలువుదీరిన వేంకటేశ్వరస్వామి కల్యాణ వేడుకలు బుధవారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామికి సన్నజాజి, మల్లె, చామంతి, బంతిలు తీర్మొక పూలతో అలంకరించారు. వేద పండితుల మంత్రోచ్ఛరణ నడుమ స్వామి కల్యాణం వైభవంగా జరిగింది.

ఘనంగా ఈశ్వరమ్మతల్లి వార్షికోత్సవం

తల్లాడ: మండలంలోని నారయ్యబంజర గ్రామంలో బుధవారం ఈశ్వరమ్మ తల్లి వార్షికోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు మట్టా దయానంద్ విజయ్‌కుమార్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు.

శాంతమ్మకు నివాళి..



శాంతమ్మకు నివాళులర్పిస్తున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

కల్లూరురూరల్: కల్లూరుకు చెందిన నిర్మల్ అడిషనల్ కలెక్టర్ లక్కినేని కిషోర్ మాతృమూర్తి లక్కినేని శాంతమ్మకు రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు బుధవారం రాత్రి నివాళులు అర్పించారు. శాంతమ్మ ఇటీవల మృతి చెందగా.. ఆమె దశదిన కర్మ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మంత్రి తుమ్మల హాజరై కుటుంబ సభ్యులైన లక్కినేని కిషోర్, ప్రసాద్‌లను పరామర్శించారు. అనంతరం శాంతమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. దశదిన కర్మకు హాజరైన వారిలో రాష్ట్ర ఉన్నతాధికారులు ఆదిలాబాద్ జిల్లా భైంసా ఆర్డీఓ కోమల్‌రెడ్డి, నిర్మల్ ఆర్డీఓ రత్నకళ్యాణి, కల్లూరు ఆర్డీఓ రాజేందర్ గౌడ్, ఏపీ పోలవరం ఏసీపీ వెంకటేశ్వరరావు, ఇరిగేషన్ కార్పొరేషన్ చైర్మన్ మువ్వా విజయ్‌బాబు, రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు మట్టా దయానంద్, జిల్లా నాయకుడు పసుమర్తి చందర్‌రావు, పలువురు ఉపాధ్యాయ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

కల్లూరులో భద్రాద్రి కోఆపరేటివ్ బ్యాంక్ ప్రారంభం




బ్యాంక్‌ను ప్రారంభిస్తున్న చైర్మన్ కృష్ణమూర్తి

కల్లూరు: కల్లూరులో భద్రాద్రి కోఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ 18వ శాఖను ఆ బ్యాంక్ చైర్మన్ చెరుకూరి కృష్ణమూర్తి, క్యాష్ కౌంటర్‌ను రైస్ మిల్లర్ల అసోసియేషన్ అధ్యక్షుడు చారుగుండ్ల అచ్యుత సీతారామారావు ప్రారంభించారు. బ్యాంక్ చైర్మన్ మాట్లాడుతూ.. తమ బ్యాంక్ రూ.930 కోట్ల లాభాలతో నడుస్తుందని.. గృహ వ్యాపార, విద్య, చిన్నతరహ పరిశ్రమలు, చిరు వ్యాపారులకు తక్కువ వడ్డీకే రుణాలు అందిస్తుందన్నారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షుడు పసుమర్తి చందర్‌రావు, బ్యాంక్ వైస్ చైర్మన్ ఉదయ్ ప్రతాప్, డైరెక్టర్లు రాజారావు, పిచ్చయ్య, వెంకటేశ్వరరావు, బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.

ఉత్సవాలకు ఆలయాలు ముస్తాబు

- 14న స్వామి వారి తిరుకల్యాణం
- ఏర్పాట్లు పూర్తి



ముస్తాబైన చింతకానిలోని శ్రీ చెన్నకేశవస్వామి దేవాలయం (ఇన్‌సెట్)ఆలయంలోని శ్రీ భూ, నీలా సమేత చెన్నకేశవస్వామి

చింతకాని: స్వామి వార్ల కల్యాణ మహోత్సవాలకు మండల కేంద్రంలో అత్యంత పురాతనమైన శ్రీ చెన్నకేశవస్వామి దేవాలయం, సీతంపేటలోని గజగిరి లక్ష్మీనర్సింహాస్వామి ఆలయం, కోమట్లగూడెంలోని శ్రీశ్రీశ్రీ అంకమ్మ తల్లి ఆలయాలను అధికారులు సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు. ఆ ఆలయాల్లోని దేవతామూర్తుల కల్యాణ మహోత్సవాలు ఈనెల 14న శుక్రవారం రాత్రి 8గంటలకు జరగనుంది. పురాతన దేవాలయాలుగా ఎంతో ఘనచరిత్ర ఉన్న ఈ ఆలయాల్లో స్వామి కల్యాణాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు ఆలయ సిబ్బంది అన్ని ఏర్పాట్లను పూర్తి చేశారు. ఆలయాలను రంగులతో పాటు విద్యుద్దీపాలను అలంకరించారు. కల్యాణ మహోత్సవాన్ని తిలకించేందుకు ఆలయానికి వచ్చేటువంటి భక్తులకు షామియానాలు, మంచినీటి సౌకర్యాలను కల్పించనున్నట్లు ఆలయకమిటీ సిబ్బంది తెలిపారు.

చెన్నకేశవస్వామి ఆలయంలో..

చింతకాని శ్రీ చెన్నకేశవస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవ కార్యక్రమాలు జరుగుతున్నాయని ఆలయ కార్యనిర్వాహణాధికారి చుండూరు రామకోటేశ్వరరావు తెలిపారు. బుధవారం ఉదయం మూర్తి కుంభస్థాపన, సాయంత్రం ప్రబంధ పారాయణం, నంబాళ్వార్ల పరమపదోత్సవం, బ్రహ్మోత్సవం ప్రారంభం, అంకురార్పణ, గురువారం ఉదయం ధ్వజారోహణం, గరుడముద్ద, సాయంత్రం చతుస్థాన అర్చనలు, దేవతాహ్వానం, బలిహారణ వంటి పూజా కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు తెలిపారు. 14న శుక్రవారం ఉదయం స్వామికి సుప్రభాతసేవ, చతుస్థాన అర్చనలు, సాయంత్రం ఆరాధన చతుస్థాన అర్చనలు, అగ్ని ప్రతిష్ఠాపన, మూలమంత్ర హోమం, ఎదుర్కోళ్ల ఉత్సవం అనంతరం రాత్రి 8 గంటలకు శ్రీ భూ, నీలాదేవి సమేత శ్రీ చెన్నకేశవ స్వామి తిరుకల్యాణాన్ని వేదపండితులు అత్యంత వైభవంగా నిర్వహించనున్నారు. అనంతరం ఆలయంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. శనివారం స్వామివారికి గ్రామసేవ, చతుస్థాన అర్చనలు, బలిహారణ, మహా పూర్ణాహుతి, చక్రస్నానం, నవకలశ స్నపనం, శ్రీ పుష్పయాగం, దేవతా ఉద్వాసన, ధ్వజారోహణం, ద్వాదశ సేవలతో శ్రీ చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాలు ముగియనున్నట్లు ఆలయ అధికారి తెలిపారు. స్వామివారి బ్రహ్మోత్సవాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

లక్ష్మీనర్సింహాస్వామి ఆలయంలో..

మండలంలోని సీతంపేట గ్రామంలోని శ్రీ గజగిరి లక్ష్మీనర్సింహాస్వామి ఆలయంలో శుక్రవారం రాత్రి గజగిరి లక్ష్మీనర్సింహాస్వామి (పానకాల స్వామి) కల్యాణాన్ని వైభవంగా నిర్వహించేందుకు ఆలయ సిబ్బంది ఏర్పాట్లు పూర్తి చేశారు. స్వామివారి కల్యాణ మహోత్సవ కార్యక్రమాలు శనివారంతో ముగుస్తాయని ఆలయ సిబ్బంది తెలిపారు.

కోమట్లగూడెం అంకమ్మతల్లి..

మండల పరిధిలోని కోమట్లగూడెం గ్రామంలో శ్రీశ్రీశ్రీ అంకమ్మ తల్లి తిరునాళ్ల మహోత్సవ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం రాత్రి అంకమ్మ తల్లి కల్యాణాన్ని నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. అమ్మవారికి జలబిందెలు, పసుపు కుంకుమలు సేకరణ, బియ్యం కొలపట్టుట వంటి పూజా కార్యక్రమాలను నిర్వహించటం జరుగుతుందని తెలిపారు.

ఏర్పాట్లు పూర్తి..



చింతకానిలో శ్రీ చెన్నకేశవస్వామి, సీతంపేటలో శ్రీ గజగిరి లక్ష్మీనర్సింహాస్వామి కల్యాణ మహోత్సవాలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం. అత్యంత వైభవంగా జరిగే స్వామి వార్ల కల్యాణ మహోత్సవంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి దీవెనలు పొందాలి. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా తగిన సౌకర్యాలను కల్పిస్తున్నాం.

– చుండూరు రామకోటేశ్వరరావు, ఆలయ కార్యనిర్వాహణ అధికారి

‘భోజన’ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



సత్తుపల్లిరూరల్: మాట్లాడుతున్న రామకృష్ణ

వైరా: మధ్యాహ్న భోజన వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా నాయకుడు సుంకర సుధాకర్ అన్నారు. బుధవారం సీఐటీయూ వైరా పట్టణ కమిటీ ఆధ్వర్యంలో మధ్యాహ్న కార్మికులు ఎమ్మెల్యే కార్యాలయంలో సిబ్బందికి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అప్పులు చేసి మరీ చిన్నారులకు భోజనం వండి పెడుతున్న మధ్యాహ్న భోజన వర్కర్ల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ వైరా పట్టణ కన్వీనర్ అనుమోలు రామారావు, మధ్యాహ్న భోజన వర్కర్లు ప్రమీల, త్రివేణి, కరుణ తదితరులు పాల్గొన్నారు.

రూ.10వేలు వేతనం చెల్లించాలి..

సత్తుపల్లిరూరల్: కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే మధ్యాహ్న కార్మికులకు వేతనం రూ.10వేలకు పెంచుతామని ఇచ్చిన హామీని నెరవేర్చాలని మధ్యాహ్న భోజన పథకం వర్కర్ల యూనియన్ రాష్ట్ర కమిటీ సభ్యుడు నిమ్మటూరి రామకృష్ణ డిమాండ్ చేశారు. బుధవారం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో స్థానిక తాపీ వర్కర్ల యూనియన్ భవనంలో యూనియన్ అధ్యక్షురాలు లక్ష్మి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి తడికమళ్ల యోబు, ఏఐటీయూసీ సత్తుపల్లి మండలం కార్యదర్శి రామారావు, మధ్యాహ్న భోజన పథకం వర్కర్ల యూనియన్ మండల ప్రధాన కార్యదర్శి మహాదేవ లక్ష్మి, జిల్లా కమిటీ సభ్యురాలు శ్రీలక్ష్మి, వెంకటలక్ష్మి, జరీనా, సావిత్రి, సత్యావతి, సీతమ్మ, నాగలక్ష్మి, రాఘవమ్మ, చుక్కమ్మ, విజయలక్ష్మి పాల్గొన్నారు.

విద్యార్థులకు పరీక్షా సామగ్రి పంపిణీ

కల్లూరు: కల్లూరు పట్టణంలోని సాంఘీక సంక్షేమ గురుకుల పాఠశాలతో పాటు పట్టణ, మండల పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి చదువుతున్న 355 మంది విద్యార్థులకు ఆశా స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు మట్టా దయానంద్ పరీక్ష ప్యాడ్లు, పెన్నులు, పెన్సిళ్లు, స్కేళ్లు బుధవారం అందజేశారు. విద్య, వైద్యం, రైతు అనే నినాదంతో ముందుకు పోతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డీఓ ఎల్.రాజేందర్, ఎంఈఓ నివేదిత, ప్రిన్సిపాల్ కనక దుర్గ, ఏఎంసీ చైర్మన్ భాగం నీరజాదేవి, సత్తుపల్లి ఏఎంసీ చైర్మన్ దోమ ఆనంద్‌బాబు, కాంగ్రెస్ సీనియర్ నాయకులు పసుమర్తి చందర్‌రావు, లక్కినేని కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

తనికెళ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో..



పరీక్ష సామగ్రి అందజేస్తున్న చేతన ఫౌండేషన్ సభ్యులు

కొణిజర్ల: మండలంలోని తనికెళ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న బాల బాలికలకు చేతన ఫౌండేషన్ (యూఎస్ఏ) వారు బుధవారం పరీక్ష సామగ్రిని వితరణ చేశారు. విద్యార్థులు చక్కగా పరీక్షలు రాసి మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలని ఫౌండేషన్ బాధ్యులు తెలిపారు. ఇన్‌చార్జ్ హెచ్‌ఎం దొండపాటి శ్రీనివాస్ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో చేతన ఫౌండేషన్ బాధ్యులు దొడ్డా సీతారామయ్య, సీహెచ్ నవీన్, షేక్ రషీద్, రామ్మోహన్‌రావు, పాఠశాల సిబ్బంది చంద్రశేఖర్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులకు నిత్యావసరాలు పంపిణీ..



నిత్యావసరాలు అందిస్తున్న ఆర్డీఓ రాజేందర్

కల్లూరు: స్ఫూర్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిరుపేద వృద్ధులు, దివ్యాంగులు, ఒంటరి మహిళలైన 21 కుటుంబాలకు ఆర్‌డీఓ ఎల్.రాజేందర్ చేతుల మీదుగా నిత్యావసర వస్తువులు అందజేశారు. ఈ సందర్భంగా ఆర్‌డీఓ రాజేందర్ మాట్లాడుతూ.. ఎక్కడో అమెరికాలో ఉంటున్న ఎన్ఆర్ఐల ద్వారా ఇక్కడ ప్రాంత ప్రజలకు సహాయ సహకారాలు అందించడం గొప్ప విషయమన్నారు. స్ఫూర్తి ఫౌండేషన్ ప్రతినిధి వరకా రామారావు మాట్లాడుతూ.. సమస్య అని వచ్చిన విద్యార్థులు అర్జీలు పెట్టుకోగానే వారికి ఆర్థిక సాయం చేస్తున్న ఫౌండేషన్ నిర్వాహకులు ఉయ్యూరు శ్రీవ్యాల్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో రిటైర్డ్ ఉపాధ్యాయుడు ఉబ్బన నాగరాజు, పీఈటీ పసుపులేటి వీరరాఘవులు, ఫౌండేషన్ వాలంటీర్లు పాల్గొన్నారు.

ఇంటి పన్నుల భారం తగ్గించాలి



వైరా మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్న సీపీఎం కార్యకర్తలు

వైరా: వైరా మున్సిపాలిటీ పరిధిలో ప్రజలపై ఇంటి పన్నుల భారాన్ని తగ్గించాలని సీపీఎం వైరా డివిజన్ కార్యదర్శి భూక్యా వీరభద్రం డిమాండ్ చేశారు. మున్సిపాలిటీలో సమస్యల పరిష్కారం కోరుతూ.. సీపీఎం వైరా పట్టణ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట నిర్వహించిన ధర్నాలో ఆయన పాల్గొని మాట్లాడారు. భారీగా పెంచిన ఇంటి పన్నులు తగ్గించాలన్నారు. పల్లిపాడు ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు ఇంటి నంబర్లు కేటాయించి వారి సమస్యలు పరిష్కరించాలన్నారు. కేరళ తరహాలో మున్సిపాలిటీలలో సైతం ఉపాధిహామీ పథకం పనులు ప్రవేశ పెట్టాలని, నిరుపేదలందరికీ ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాన్ని వర్తింప చేయాలన్నారు. సమస్యలు పరిష్కరించకపోతే ప్రజలను సమీకరించి మరింత పెద్ద ఎత్తున ఉద్యమం లేవదీస్తామన్నారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ వేణుకు వినతిపత్రం ఇవ్వగా సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకుపోయి పరిష్కారానికి కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు తాళ్లపల్లి కృష్ణ, దుగ్గి కృష్ణ, మచ్చా మణి, నాగేశ్వరరావు, కుటుంబరావు, శ్రీనివాసరావు, సుధాకర్, సమత, రజిత, వెంకటేశ్వరరావు, మోహన్‌రావు, కృష్ణవేణి, రవి, రామారావు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలు

సత్తుపల్లిటౌన్: గుర్తు తెలియని వాహనం ఢీకొని ఓ వ్యక్తికి తీవ్రగాయాలైన సంఘటన బుధవారం రాత్రి సత్తుపల్లిలో చోటుచేసుకుంది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అన్నపురెడ్డిపల్లి మండలం ఎర్రగుంటకు చెందిన ఉపాధ్యాయుడు అగ్గి రవి ద్విచక్ర వాహనంపై సత్తుపల్లి నుంచి పెనుబల్లి వైపు వెళ్తుండగా పట్టణ వెంగళరావు నగర్ శివారులో ఎదురుగా వస్తున్న గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. దీంతో తీవ్రగాయాలైన రవిని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం ఖమ్మం తరలించారు.

ముగ్గురికి తీవ్ర గాయాలు

సత్తుపల్లిటౌన్: రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి తీవ్ర గాయాలైన సంఘటన సత్తుపల్లిలో బుధవారం రాత్రి చోటుచేసుకుంది. కిష్టారం గ్రామానికి చెందిన లారీ డ్రైవర్ గద్దే వెంకటేశ్వరరావు మద్యం మత్తులో బైక్ నడుపుతూ సత్తుపల్లిలో రింగ్ సెంటర్ వైపు వస్తున్నాడు. ఈ క్రమంలో జవహర్ నగర్‌కు చెందిన చప్పిడి హేమంత్, వెంకన్నలు నడుచుకుంటూ స్థానిక హాయ్ స్పందన హోటల్ సమీపంలో రింగ్ సెంటర్ వైపు వెళ్తుండగా.. వీరిని బైక్‌తో అతివేగంగా ఢీకొట్టి పడిపోయాడు. దీంతో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. వీరిని 108 వాహనంలో స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. క్షతగాత్రులను పరిస్థితి విషమంగా ఉండటంతో ఖమ్మం తరలించారు.

సన్మానం..

తల్లాడ: మండలంలోని మల్లవరం గ్రామంలో గ్రూప్-2లో ప్రతిభ కనబర్చి ర్యాంక్ సాధించిన దుగ్గిదేవర వెంకటేశ్వరరావును బుధవారం బీజేపీ నాయకులు శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు వెంకటరామారావు, కృష్ణారావు, కృష్ణ, కిరణ్ పాల్గొన్నారు.

జేఎల్‌గా ఉద్యోగం సాధించిన యువకుడు

వైరారూరల్: మండలంలోని దాచాపురం గ్రామానికి చెందిన అయిలూరి బ్రహ్మానందరెడ్డి ప్రభుత్వ జూనియర్ లెక్చరర్ ఉద్యోగాన్ని సాధించాడు. బుధవారం హైదరాబాద్ రవీంద్రభారతి కళాశాలలో హిస్టరీ లెక్చరర్‌గా ఉద్యోగం లభించింది. పీజీ పూర్తిచేసిన అతను ఇటీవల జరిగిన గ్రూప్–1 పరీక్ష రాసి జూనియర్ లెక్చరర్‌గా ఉద్యోగం సాధించాడు.

విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి

సత్తుపల్లిరూరల్: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని ప్రిన్సిపాల్ చలసాని హరికృష్ణ తెలిపారు. బుధవారం మండలంలోని కొత్తూరు మదర్‌థెరిస్సా అటానమస్ ఇంజనీరింగ్ కళాశాల 24వ వార్షికోత్సవ ఉత్సవాల్లో భాగంగా విద్యార్థులకు నిర్వహించిన క్రీడా పోటీలను కల్లూరు ఏసీపీ ఎ.రఘు ప్రారంభించి మాట్లాడారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రతి రోజు ఒక గంట క్రీడలను ఆడించాని, దీంతో మానసిక ఆరోగ్యం మెరుగుపడి పోటీ తత్వం పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో సత్తుపల్లి ఎస్సై టి.కవిత, కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ సాంబశివరావు, చైర్మన్ సత్యనారాయణ, వైస్ ప్రెసిడెంట్ ప్రభాకర్‌రావు, డైరెక్టర్ సత్యానారాయణ, అకడమిక్ డైరెక్టర్ ఎ.బి.శ్రీనివాసరావు, ఇంజనీరింగ్ డీన్ జాకీర్ హుస్సేన్, ఐక్యూసీ కోఆర్డినేటర్ రామచంద్రరావు, క్రీడా పోటీల కన్వీనర్ పి.మారేశ్వరరావు, మిస్ట్ కళాశాలల ప్రిన్సిపాల్స్ శ్రీనివాసరెడ్డి, ఎల్‌వీఆర్ దీక్షితులు, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి తట్టుకోలేకే విమర్శలు

ఎర్రుపాలెం: తెలంగాణాలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల కోసం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమం తట్టుకోలేకనే బీఆర్ఎస్ పార్టీ నాయకులు విమర్శలు చేస్తున్నారని మధిర ఏఎంసీ చైర్మన్ బండారు నర్సింహారావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2014 సంవత్సరంలో మిగులు బడ్జెట్‌తో తెలంగాణ రాష్ట్రాన్ని అప్పగిస్తే కేవలం కొంతమందికి మాత్రం లబ్ధి చేకూరే విధంగా పథకాలు అమలు చేశారని, మిగిలిన వాళ్లను గాలికి వదిలేసి అప్పుల రాష్ట్రంగా మార్చారని ఆరోపించారు. నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి పనులను ఒక్కసారి తిరిగి చూస్తూ బీఆర్ఎస్ నాయకులకు అర్థం అవుతుందన్నారు. కాంగ్రెస్ పాలనలో అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు నిరంతరం కొనసాగుతాయన్నారు.

భగవద్గీత కంఠస్థ పోటీల్లో గోల్డ్ మెడల్

ఏన్కూరు: మండలంలోని టీఎల్ పేటకు చెందిన కట్ట వైదేహి భగవద్గీత కంఠస్థ పోటీల్లో ప్రతిభ కనబర్చి గోల్డ్ మెడల్ సాధించింది. గణపతి సచ్చిదానంద సంస్థ మైసూర్ దత్త పీఠం వారు ఆన్‌లైన్లో నిర్వహించిన పోటీల్లో 18 అధ్యాయాలు, 700 శ్లోకాలు కంఠస్థం చేసిన వైదేహి గోల్డు మెడల్ సాధించగా.. ఆమెను వారాహి బాల భగవద్గీత గ్రూపు సభ్యులు, స్థానికులు అభినందించారు.

మాజీ సర్పంచ్‌ల ముందస్తు అరెస్ట్

ముదిగొండ: మాజీ సర్పంచ్‌ల పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలని కోరుతూ.. ఛలో అసెంబ్లీకి పిలుపునిచ్చిన నేపథ్యాన మండలంలోని పలువురు మాజీ సర్పంచ్‌లను ముదిగొండ పోలీసులు బుధవారం ముందస్తు అరెస్టు చేశారు. మండలంలోని ఏడుగురి మాజీ సర్పంచ్‌లను మందస్తు అరెస్టు చేసి వ్యక్తిగత పూచీకత్తుపై పంపించినట్లు సీఐ మురళి తెలిపారు.

తహసీల్దార్‌కు వినతి

చింతకాని: సమగ్ర కుటుంబ సర్వే చేసిన సిబ్బందికి చెల్లించాల్సిన బకాయిలను వెంటనే విడుదల చేయాలని టీఎస్‌యూటీఎఫ్ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రమణ, తోటకూరి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. బుధవారం తహసీల్‌లో.. తహసీల్దార్ కూరపాటి అనంతరాజుకు టీఎస్‌యూటీఎఫ్ నాయకులు వినతిపత్రం అందించారు.

పోరాటాలకు సిద్ధంగా ఉండాలి

మధిర: రైతు సమస్యలపై పోరాటాలకు సిద్ధంగా ఉండాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు భాగం హేమంతరావు తెలిపారు. బుధవారం మడుపల్లి సీపీఐ కార్యాలయంలో నిర్వహించిన రైతు సంఘం 3వ మండల మహాసభలో ఆయన పాల్గొని మాట్లాడారు. పోరాటాలతోనే సమస్యలు పరిష్కారమవుతాయని, ఢిల్లీలో జరిగిన రైతు పోరాటమే ఉదాహరణ అన్నారు. రైతు సంఘం జిల్లా అధ్యక్ష , కార్యదర్శులు దొండపాటి రమేష్, కొండపర్తి గోవిందరావు, నాయకులు పాల్గొన్నారు.

ఐద్వా ఆవిర్భావ దినోత్సవం

కారేపల్లి/సత్తుపల్లిరూరల్: మహిళల అణిచివేతపై ఉద్యమం తప్పదని ఐద్వా మండల అధ్యక్ష, కార్యదర్శులు దనమ్మ, ఉమావతి తెలిపారు. బుధవారం కారేపల్లి మండలం గాంధీనగర్, మాణిక్యారం, పాటిమీదిగుంపు గ్రామాల్లో ఐద్వా ఆవిర్భావ దినోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రదర్శన నిర్వహించారు. అదే విధంగా సత్తుపల్లిరూరల్ మండలంలోని సిద్దారం గ్రామంలో మండల కార్యదర్శి జాజిరి జ్యోతి ఐద్వా జెండా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఐద్వా నాయకురాళ్లు నీలమ, సూరమ్మ, రామతార, అంబిక, మహిళా సంఘం బాధ్యులు లక్ష్మి, నిర్మల, వెంకటలక్ష్మి, సుధారాణి, సమ్మక్క, జయమ్మ, రమాదేవి పాల్గొన్నారు.

ఆరు గ్యారంటీలు అమలు చేయాలి



మాట్లాడుతున్న వెంకటేశ్వరరావు

తల్లాడ: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారంటీలను వెంటనే అమలు చేయాలని సీపీఎం మండల కార్యదర్శి అయినాల రామలింగేశ్వరరావు అన్నారు. బుధవారం మండలంలో సీపీఎం నాయకులు ఇంటింటికి తిరుగుతూ కరపత్రాలను అందజేశారు. అధికారంలోకి వచ్చిన వందరోజుల్లోనే రైతు రుణమాఫీ, ఇందిరమ్మ ఇళ్లు, రేషన్‌కార్డులు, ఉద్యోగాలు, రూ.4వేలు పెన్షన్ ఇస్తామన్న హామీలను వెంటనే అమలుచేయాలన్నారు. లేనిఎడల పోరాటం చేసేందుకు సిద్దంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు ఎస్.మోహన్‌రావు, పులి వెంకటనరసయ్య, భవాని, కృష్ణయ్య, తుమ్మలపల్లి వెంకటయ్య, పడాల సత్యం , షేక్ నాగులు పాల్గొన్నారు.

మండలంలోని తనికెళ్లలో..

కొణిజర్ల: ఆరు గ్యారంటీల అమలుకై ప్రజలందరూ పోరాటాలకు సిద్ధం కావాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు తాళ్లపల్లి కృష్ణ డిమాండ్ చేశారు. బుధవారం తనికెళ్లలో వేముల సాంబ అధ్యక్షతన ఏర్పాటు చేసిన అన్నారపు లాలయ్య వర్ధంతి సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఎన్నికల్లో ప్రజలకిచ్చిన హామీలను కాంగ్రెస్ విస్మరించిందన్నారు. కార్యక్రమంలో నాయకులు షేక్ రంజాన్, చింత నిప్పు సూరయ్య, చెరుకుమల్లి కుటుంబరావు, చల్లా నారాయణ, యాసా ప్రభాకర్‌రావు , యాసా తిలక్, పాపిట్ల ప్రసాద్, ఐలూ నాయకులు అన్నారపు వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ఎర్రుపాలెంలో..

ఎర్రుపాలెం: ప్రజలకిచ్చిన హామీలను ప్రభుత్వం నెరవేర్చాలని సీపీఎం రాష్ట్ర కమిటీ నాయకుడు పొన్నం వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. బుధవారం మండలకేంద్రంలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సమావేశంలో డివిజన్ కార్యదర్శి మడుపల్లి గోపాలరావు, జిల్లా కమిటీ సభ్యులు దివ్వెల వీరయ్య, మండల కార్యదర్శి మద్దాల ప్రభాకర్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న నిరసన దీక్ష



మధిర: మాట్లాడుతున్న సునీల్ మాదిగ



ఏన్కూరు: దీక్షా శిబిరంలో ఎమ్మార్పీఎస్ నాయకులు

ఎస్సీ వర్గీకరణ చట్టం చేసేంతవరకు ఉద్యోగ నియామకాలు నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ.. ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో తహసీల్ వద్ద చేపట్టిన నిరసన దీక్షలు బుధవారం రెండో రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ నాయకులు మాట్లాడుతూ.. ఉస్మానియా యూనివర్సిటీ కేంద్రంగా విద్యార్థుల పట్ల పోలీసుల వైఖరి, కాంగ్రెస్ ప్రభుత్వం వైఖరి దుర్మార్గమని తెలిపారు. ఈ సందర్భంగా దీక్షను పలువురు నాయకులు సందర్శించి సంఘీభావం తెలిపారు.

– సాక్షి నెట్‌వర్క్

నేడు విద్యుత్ సరఫరా బంద్

తల్లాడ: మండలంలోని కుర్నవల్లి సబ్‌స్టేషన్ పరిధిలో ముద్దునూరు ఫీడర్‌లో మరమ్మతుల దృష్ట్యా గురువారం విద్యుత్ సరఫరా నిలిపి వేయనున్నట్లు కుర్నవల్లి విద్యుత్‌శాఖాధికారి దారా కృష్ణకాంత్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ముద్దునూరు, పాత రంగాపురం, కొత్త రంగాపురం గ్రామాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం కల్గుతుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

పోలీస్‌స్టేషన్‌కు చేరిన ‘పది’ ప్రశ్నపత్రాలు

ముదిగొండ: పదోతరగతి పరీక్ష సెట్-1 ప్రశ్నపత్రాలు ముదిగొండ పోలీస్‌స్టేషన్‌కు బుధవారం చేరుకున్నాయి. కస్టోడియన్, జాయింట్ కస్టోడియన్, సీఎస్‌లు, డీఓల సమక్షంలో పదిపరీక్ష పత్రాలు భద్రపరిచారు. మండలంలోని మొత్తం 450మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నట్లు ఎంఈఓ రమణయ్య తెలిపారు. కార్యక్రమంలో కస్టోడియన్, జాయింట్ కస్టోడియన్, సీఎస్, డీఓలు శాంతి, వెంకట్రామిరెడ్డి, కాశీశ్వర్, ప్రసాద్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

‘మహా ప్రస్థానం’ వాహనం ఫ్రీజర్ బాక్స్ ప్రారంభం

పెనుబల్లి: పెనుబల్లి మండల కాకతీయ కమ్మ సేవ సంఘం ఆధ్వర్యంలో ప్రస్థానం ఫ్రీజర్ బాక్స్‌ను బుధవారం ప్రారంభించారు. ప్రస్థాన వాహనానికి నిధులు అందజేసిన పోపూరి అంకినీడు వాహనాన్ని ప్రారంభించారు. మూడున్నర లక్షల్లో కొనుగోలు చేసిన ఫ్రీజర్ బాక్స్ అన్ని వర్గాలకు అందుబాటులో ఉంటుందన్నారు. కార్యక్రమంలో సాంబశివరావు, సూర్యదేవర రవికుమార్, నరసింహారావు, సత్యనారాయణ, గోగినేని రమేష్, ప్రసాద్ పాల్గొన్నారు.